
సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం | 1 | ఏప్రిల్ | 2024



రూ.5 లక్షల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి కొవ్వూరి శివశంకర రెడ్డి, పద్మ దంపతులు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.5,00,117 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 2,199, మధ్య డెల్టాకు 1,000, పశ్చిమ డెల్టాకు 3,926 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ (సా॥)	సెహరీ మం (ఉ॥)
రాజమహేంద్రవరం	6.25	4.36
కాకినాడ	6.25	4.36
అమలాపురం	6.25	4.36

న్యూస్‌రీల్

కోటసత్తెమ్మ సన్నిధిలో భక్తుల సందడి

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా ఆలయానికి రూ.1,20,096 ఆదాయం వచ్చిందని ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన మే 1 నుంచి 31వ తేదీ వరకూ జిల్లాలోని వివిధ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అండర్–14 విభాగంలో 25 మంది బాలురు, 25 మంది బాలికలకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆసక్తి ఉన్న వివిధ క్రీడల జిల్లా అసోసియేషన్లు, పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, సీనియర్ క్రీడాకారులు పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తులో క్రీడ, క్రీడా ప్రాంగణం, క్రీడా ఇన్‌చార్జి పేరు, హోదా, మొబైల్ నంబర్ (వాట్సాప్ నంబర్), మండలం (గ్రామీణ/పట్టణ క్యాంపు) తదితర వివరాలు పేర్కొనాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 5వ తేదీ లోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయానికి నేరుగా లేదా egdsarajamahendravaram@gmail.com ఈ–మెయిల్ ద్వారా వివరాలు పంపిచాలని సూచించారు.

ఘనంగా సత్యదేవుని రథసేవ

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథసేవ ఆదివారం ఆలయ ప్రాకారంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చి, స్వామి, అమ్మవారిని వేంచేయించి, అర్చకులు పూజలు చేశారు. అనంతరం ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు కొబ్బరికాయ కొట్టి రథసేవను ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, బాజా భజంత్రీల ఘోష నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో మూడు సార్లు రథంతో ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం పండితులు మళ్లీ పూజలు నిర్వహించి, స్వామి, అమ్మవార్లను మేళతాళాల మధ్య ఆలయానికి తీసుకుని వెళ్లారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. రూ.2,500 చొప్పున టికెట్లు కొనుగోలు చేసిన నలుగురు భక్తులు ఈ రథసేవలో పాల్గొన్నారు. తద్వారా ఆలయానికి రూ.10 వేల ఆదాయం సమకూరింది. ఆ భక్తులకు స్వామివారి అంతరాలయ దర్శనంతో పాటు వేదాశీస్సులు అందజేసి, స్వామివారి కండువా, జాకెట్టు ముక్క, ప్రసాదం బహూకరించారు. రథసేవను ఆర్జిత సేవగా మార్చిన తరువాత రెండు వారాల్లో రూ.25 వేల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.



పరలోకగతులైన తమ వారి సమాధి వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న చిన్నారులు

• ప్రేమమూర్తి.. నిత్యస్ఫూర్తి

క్రౌర్యం, ద్వేషం, హింస వంటి అమానవీయ లక్షణాలతో కునారిల్లిపోతున్న సమాజానికి.. ప్రేమ, శాంతి, దయ, అహింస, క్షమ, సహనం, త్యాగం వంటి మానవీయ లక్షణాలను అందించి.. వెలుగు రేఖలా ప్రభవించిన మహనీయుడు ఏసుక్రీస్తు. ప్రపంచ మానవాళి కోసం గుడ్ ఫ్రైడే నాడు శిలువపై క్రూరమైన మరణం పొందిన ఆ కరుణామయుడు.. తాను సమాధి నుంచి తిరిగి పునరుత్థానం చెందుతానని ముందుగానే ప్రకటించి.. మూడో రోజున అదేవిధంగా చేసి చూపి.. అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆ సుదినమే ఈస్టర్ పర్వదినం. ఈ పండగను క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆ ప్రభువు మాదిరిగానే పరలోకగతులైన తమ కుటుంబ సభ్యులు సైతం సజీవులుగా తిరిగి వస్తారనే నమ్మకంతో.. వారి సమాధులను శుభ్రపరచి, పువ్వులతో అలంకరించి, వేకువనే కొవ్వొత్తులు వెలిగించి, ప్రార్థనలు నిర్వహించారు. తెల్లవారు జామునే క్రైస్తవులు సమాధుల వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా దైవజనులు ప్రసంగిస్తూ క్రీస్తు స్ఫూర్తిని అందిపుచ్చుకుంటూ.. ఆ ప్రేమమూర్తి చూపిన దారిలో పయనించాలని బోధించారు.



రాజమహేంద్రవరం బైపాస్ రోడ్డులో కొవ్వొత్తుల వెలుగుల్లో ప్రకాశిస్తున్న క్రైస్తవుల సమాధుల తోట

దాహార్తికి చెక్

- వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ
- ప్రణాళికతో సిద్ధమైన ఆర్‌డబ్ల్యూఎస్
- బోర్లు, చేతి పంపులు, పైప్‌లైన్లకు మరమ్మతులు
- జూన్ వరకూ నీటి సరఫరా అందించాలన్నదే లక్ష్యం

సాక్షి, రాజమహేంద్రవరం: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికార యంత్రాంగం ముందస్తుగా అప్రమత్తమైంది. వచ్చే జూన్ నెలాఖరు వరకూ ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేయడంలో ఎటువంటి ఆటంకాలూ ఎదురవకుండా ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసింది. జిల్లావ్యాప్తంగా ఏ ఒక్క ప్రాంతంలోనూ నీటి సమస్య తలెత్తకుండా గ్రామీణ నీటి పారుదల (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మునిసిపల్, ఎంపీడీఓలతో కలెక్టర్ కె.మాధవీలత ఇప్పటికే ప్రత్యేక సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 18 మండలాలు, 298 గ్రామ పంచాయతీలు, 482 ఆవాసాల్లో 14.74 లక్షల జనాభా నివసిస్తోంది. వారికి ప్రధాన తాగునీటి వనరు అఖండ గోదావరి. దీని ద్వారా ప్రజలకు రక్షిత జలాల సరఫరాకు 7 సమగ్ర సీపీడబ్ల్యూ స్కీమ్ (సస్టైనబుల్ వాటర్ సప్లై), 643 పీడబ్ల్యూఎస్ (పైప్డ్ వాటర్ సప్లై), 265 ఎంపీడబ్ల్యూఎస్ స్కీములు (మినీలేనియస్ పబ్లిక్ వాటర్ సప్లై), 40 డైరెక్ట్ పంపింగ్ స్కీములు ఉన్నాయి. వీటితో పాటు 2,234 చేతిపంపులు కూడా ఉన్నాయి. గోదావరిలో నీటి లభ్యతపై అధికారులు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు. గోదావరిలో నీటి మట్టం 38 అడుగుల వరకూ ఉన్నా తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు కలగవు. గత ఏడాది నీటిమట్టం 35 అడుగులకు చేరినా తాగునీరు సరఫరా చేశారు. ప్రస్తుతం అఖండ గోదావరి నీటిమట్టం 45 అడుగులు ఉంది. దీనిని బట్టి చూస్తే రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నీటి ఎద్దడి తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఒకవేళ నీటి ఎద్దడి తలెత్తితే ఎక్కడెక్కడ ఇబ్బంది వస్తుందో ఇప్పటికే అంచనా వేశారు.

ఇదీ కార్యాచరణ

తాగునీటి ఎద్దడి నివారణకు రూపొందించిన వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అవసరమైనచోట్ల తాగునీటి బోర్లు, చేతి పంపులకు, పైపులైన్లకు మరమ్మతులు చేపడతారు. మంచినీటి ట్యాంకుల పరిస్థితి, లీకేజీలను పరిశీలిస్తారు. ట్యాంకుల మరమ్మతులు, పరిశుభ్రత పనులకు ప్రాధాన్యం ఇస్తారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 51 బోర్ వెల్స్‌లో నీటి లభ్యత కొద్దిగా తగ్గే అవకాశం ఉందని భావిస్తున్న అధికారులు.. వాటిని శుభ్రం చేసేందుకు (ఫ్లషింగ్) రూ.6.12 లక్షలు కేటాయించారు. నీటి లభ్యత తగ్గిన వెంటనే వాటిని ఫ్లషింగ్ చేసి నీరు సమృద్ధిగా అందుబాటులోకి తీసుకురానున్నారు. కొత్తగా నిర్మించిన కాలనీల్లో తాగునీరు, ఇతర వినియోగానికి ఏర్పాటు చేసిన మోటార్లపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. గ్రామీణ స్థాయిలో తాగునీటి సరఫరా, సీపీడబ్ల్యూఎస్ పథకాల నిర్వహణకు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోనున్నారు. ప్రభుత్వ ఆర్‌ఓ ప్లాంట్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా కూడా నీరు సరఫరా చేయనున్నారు. అయితే, దాదాపు ఆ పరిస్థితులు ఎక్కడా తలెత్తవని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని మూగజీవాలకు సైతం తాగునీటిని అందించేందుకు నీటి టబ్‌లు ఏర్పాటు చేయనున్నారు.



రాజానగరం మండలం సంపత్‌నగరంలోని నీటి ట్యాంక్



కడియం మండలం దుళ్లలో తాగునీటి ట్యాంక్

జిల్లాలోని ప్రధాన స్కీముల నుంచి నీటి సరఫరా చేస్తున్నారిలా..

జిల్లా వ్యాప్తంగా తాగునీరు అందించేందుకు ప్రధానంగా 7 కాంప్రహెన్సివ్ ప్రొటెక్టెడ్ వాటర్ సప్లై (సీపీడబ్ల్యూఎస్) స్కీములు పని చేస్తున్నాయి. వీటి ద్వారా 216 గ్రామ పంచాయతీల్లోని 8,22,257 మందికి ప్రతి రోజూ 80.98 మిలియన్ లీటర్ల తాగునీరు అందిస్తున్నారు. మిగిలిన జనాభాకు ఇతర పథకాల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. దీనికి గాను ఏటా 582.906 టీఎంసీల నీరు అవసరమవుతోంది.

నీటి పథకం	నీరు సరఫరా చేస్తున్న పంచాయతీలు	అందిస్తున్న నీరు (మిలియన్ లీటర్లు)	జనాభా
సీపీడబ్ల్యూఎస్ వాగల్పాడు	9	2.70	55,535
కడియం	54	22.00	2,53,441
సీతానగరం	11	10.50	46,366
రంగంపేట	14	8.50	35,252
తాడిపూడి	16	5.00	59,790
ఎస్ఎస్–సీపీడబ్ల్యూఎస్ (పురుషోత్తపట్నం)	65	10.50	1,69,526
ఎస్ఎస్–సీపీడబ్ల్యూఎస్ (గోపాలపురం)	47	21.75	2,02,347

గత వేసవిని దృష్టిలో పెట్టుకుని..

గత ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వేడి వాతావరణం నెలకొంది. వడగాలులు ఇబ్బందులకు గురి చేశాయి. గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. ఫలితంగా అప్పట్లో పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. ఏప్రిల్‌లో 12 మండలాల పరిధిలోని 20 గ్రామాలు, మే నెలలో 12 మండలాల పరిధిలోని 28 గ్రామాల్లో నీటి సమస్య తలెత్తే ఆస్కారం ఉంటుందని అప్పట్లో అంచనా వేశారు. ఈ నేపథ్యంలో గత వేసవిలో రూ.10 లక్షలతో బోర్ల మరమ్మతులతో పాటు నీటి ఎద్దడి నివారణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకున్నారు. రెండు నెలలు మాత్రం కొన్ని గ్రామాల్లోని బోర్లలో నీళ్లు అడుగంటడంతో వాటిని ఫ్లషింగ్ చేశారు. ఈసారి అఖండ గోదావరిలో అవసరమైన మేరకు నీటి నిల్వలున్నాయి. దీంతో గత ఏడాది పరిస్థితులు ఈసారి పునరావృతమయ్యే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

సామర్థ్యానికి అనుగుణంగా సరఫరా



రానున్న వేసవిలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నీటి పథకాలను పకడ్బందీగా నిర్వహిస్తాం. మరమ్మతుల కారణంగా నీటి సరఫరాకు ఏ ఒక్క రోజూ అంతరాయం కలగకుండా చూస్తాం. క్షేత్ర స్థాయిలోని డీఈ, ఏఈలను ఇప్పటికే అప్రమత్తం చేశాం. కొత్తగా నిర్మించిన హౌసింగ్ కాలనీల్లో అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యత ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. బోర్లు, పంపుసెట్లు, సీపీడబ్ల్యూఎస్ పథకాలు పాడైతే తక్షణం బాగు చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

– కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

నీటి ఎద్దడికి అవకాశాలు తక్కువ



అఖండ గోదావరిలో ప్రస్తుతం నీటిమట్టం ఆశించిన మేరకు ఉంది. ఫలితంగా ఈ ఏడాది నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏప్రిల్, మే నెలల్లో బోర్లలో నీటి లభ్యత తగ్గే ప్రాంతాలను గుర్తించాం. వాటిని శుభ్రం చేసి పుష్కలంగా నీరు అందేలా ప్రణాళికలు రూపొందించాం. బోర్ల ఫ్లషింగ్‌కు నిధులు ఏమేరకు అవసరమో అంచనాలు రూపొందించాం. ఏ ప్రాంతంలోనూ దాహార్తి నెలకొనే పరిస్థితి రాకుండా చూస్తాం.

– డి.బాలశంకరరావు, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

సచివాలయాల వద్ద 3 నుంచి పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు, ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో సామాజిక భద్రత పింఛన్లను ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకూ ఆయా సచివాలయాల వద్ద అందజేయనున్నారు. కలెక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని పింఛన్‌దారులందరూ వారి ప్రాంతాల్లోని గ్రామ/వార్డు సచివాలయాల వద్ద సచివాలయం సిబ్బంది ద్వారా పింఛన్లు పొందాలని సూచించారు. ఆధార్ కార్డు, పెన్షన్ పాసు పుస్తకం తీసుకుని వెళ్లాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ సామాజిక భద్రత పింఛన్లను సచివాలయాలు వద్దనే పంపిణీ చేయడానికి తగిన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.

వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు కుట్రలు

పి.గన్నవరం: వలంటీర్ల ద్వారా పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా కుట్రలు చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు రానున్న ఎన్నికల్లో తగిన మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. వలంటీర్ వ్యవస్థపై ఆయన చేస్తున్న కుట్రలను విప్పర్తి తీవ్రంగా ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థపై కక్షతో నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఆయన ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారని ఆయన వివరించారు. చంద్రబాబు కుట్రల వల్ల వృద్ధులు, వికలాంగులు పింఛన్ల కోసం ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదాన పథకానికి పిఠాపురానికి చెందిన ఎస్.సత్యనారాయణ కుటుంబం ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించింది. ఆ దాతలకు అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం, ఆలయ పర్యవేక్షకులు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

సాంకేతిక విద్య.. ఉజ్వల భవిత

- పాలిటెక్నిక్ విద్యతో మంచి ఉద్యోగాలు
- పదో తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం
- పాలిసెట్‌కు తుది గడువు ఈ నెల 5
- నేటి నుంచి ఉచిత శిక్షణ తరగతులు

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి విద్యార్హతతో సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిసెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించిన వారికి రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తాయి. సాంకేతిక విద్యా శాఖ ఉన్నతాధికారులు ఫిబ్రవరిలోనే పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తులకు ఈ నెల 5వ తేదీ తుది గడువు. ఇప్పటికే పదో తరగతి పరీక్షలు మార్చి 26వ తేదీతో ముగిశాయి. వీరందరూ పాలిసెట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. దీనిపై ఇప్పటికే పోస్టర్లు, కరపత్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఉపయుక్తం

ఎక్కువ ఖర్చుతో కూడుకున్నది కావడంతో ఇంజినీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక విద్య చదవడం గ్రామీణ పేద విద్యార్థులకు సాధ్యం కాదు. తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య లభిస్తే.. దానిని పునాదిగా చేసుకుని భావి జీవితానికి బంగారు బాటలు వేసుకునే అవకాశం వారికి లభిస్తుంది. దీనికి పాలిటెక్నిక్ కోర్సులు వేదికగా నిలుస్తాయి. పాలిసెట్‌లో ర్యాంకు సాధించడం ద్వారా పాలిటెక్నిక్ కోర్సులు చదివి సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు.



కోర్సుల వివరాలు

ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సులు అందిస్తున్నాయి. ప్రతి కళాశాలలో ఒక్కో కోర్సులో ఒక్కో బ్రాంచికి 30 నుంచి 60 ఆపైన సీట్లు ఉంటాయి. జిల్లాలోని బొమ్మూరు, అనపర్తిల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలుండగా, మరో నాలుగు ప్రైవేటు కళాశాలలు కూడా ఉన్నాయి. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్స్ 60, ఈసీఈ 60, మెకానికల్ 60 చొప్పున సీట్లు ఉన్నాయి. అనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ 33, ఈసీఈ 33, మెకానికల్ 33 సీట్లు ఉన్నాయి. నాలుగు ప్రైవేటు కళాశాలల్లో సుమారు 600 వరకూ సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుల కాల వ్యవధి మూడేళ్లు. దీనిలో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునేందుకు సైతం శిక్షణ ఇస్తారు.

పాలిసెట్ పరీక్ష ఇలా..

పాలిసెట్ పరీక్షను 120 మార్కులకు నిర్వహిస్తారు. వీటిలో గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400 చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాలి. ఆన్‌లైన్‌లో ఏప్రిల్ ఐదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలుకు https://polycetap.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి. పాలిసెట్‌లో క్వాలిఫై మార్కులు 35గా నిర్ణయించారు.


ఎన్నో ప్రయోజనాలు

పాలిటెక్నిక్‌లో ఏ కోర్సు పూర్తి చేసినా ఉద్యోగం, ఉపాధి సులభంగా లభిస్తాయి. ఈ కళాశాలల్లో ఇటీవల తరచుగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సు చదవడానికి తక్కువ ఫీజు ఉంటుంది. పాలిసెట్ ద్వారా ప్రవేశం పొందిన అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్, వసతి సౌకర్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంటాయి. ఇక్కడ చదువు పూర్తయిన తరువాత ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో చేరవచ్చు. లేదా ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తుకు తుది గడువు: ఏప్రిల్ 5
ప్రవేశ పరీక్ష: ఏప్రిల్ 27
ఫలితాలు: మే 25
కౌన్సెలింగ్: జూన్ నాలుగో వారం నుంచి

పాలిటెక్నిక్‌తో ఉద్యోగావకాశాలు



పదో తరగతి తరువాత పాలిటెక్నిక్ చదివితే చిన్న వయస్సులోనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధికి కూడా అవకాశం ఉంటుంది. క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఇప్పటి వరకూ అనేక మంది ఉద్యోగాలు పొందారు. పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణతో పాటు, మెటీరియల్ కూడా అందిస్తున్నాం. మా కళాశాలలో సోమవారం నుంచి ఈ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలి.

– వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, బొమ్మూరు

క్లుప్తంగా

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు హేమంత్


రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలో ప్రథమ బహుమతి సాధించిన గంగా హేమంత్

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామానికి చెందిన ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి సామన గంగా హేమంత్ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మార్చి 27, 28 తేదీల్లో చిత్తూరు జిల్లా తిరుపతిలో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో పాల్గొని బంగారు పతకం సాధించినట్లు తల్లి సామన సత్య ఆదివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించడంతో ఏప్రిల్ 11, 12 తేదీల్లో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు తన కుమారుడు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉన్నదని సత్య తెలిపారు. సత్య ప్రస్తుతం గొంచాల వలంటీరుగా పని చేస్తున్నారు. విద్యార్థి తండ్రి వీరబాబు వ్యవసాయ కూలీగా పని చేస్తున్నారు. హేమంత్‌ను గొంచాల సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ, గ్రామ పెద్దలు అభినందించారు.

తిరుమల అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం కాతేరులో తిరుమల విద్యా సంస్థల ప్రాంగణంలో ఆదివారం జరిగిన అవగాహన సదస్సుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందని ఆ సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. సదస్సుకు సుమారు 20 వేల మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు వారి బిడ్డల భవిష్యత్తు గురించి ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. జాతీయస్థాయి పరీక్షలైన జేఈఈ(మెయిన్స్), జేఈఈ (అడ్వాన్స్‌డ్), నీట్‌లలో తరచుగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్మార్ట్ గ్యాంబ్లింగ్!

- ఆఫర్లతో వల విసురుతున్న యాప్‌లు
- గేమ్స్‌కు బానిసైతే బుక్కైనట్లే
- బలవుతున్న చిన్నారులు, యువత
- లూటీ అవుతున్న బ్యాంకు ఖాతాలు
- వ్యక్తిగత సమాచారం సైతం దోపిడీ


ఆన్‌లైన్ గేమ్స్‌కు అవసరమయిన సెల్‌ఫోన్, సిస్టం

రంగంపేట: స్మార్ట్ ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్స్ వల్ల ఎన్నో నష్టాలు పొంచి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రత్యేకించి చిన్నారులు, విద్యార్థులు, యువతీ, యువకులు ఇటీవల కాలంలో ఫోన్లతోనే విలువైన కాలాన్ని వెచ్చిస్తూ ఆన్‌లైన్ గేమ్‌లు విపరీతంగా ఆడుతున్నారు. కొందరైతే ఆ గేమ్స్‌కు బానిసలుగా మారిపోయారంటే అతిశయోక్తి కాదు. దీని వల్ల ఎన్నో ప్రమాదాలు ఎదుర్కోవలసి వస్తుందని అటు పోలీసు అధికారులు, ఇటు మానసిక వైద్యులు స్పష్టం చేస్తున్నారు. విచ్చలవిడిగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ బ్యాంకు ఖాతాల్లో సొమ్ము కోల్పోవడంతో పాటు అనారోగ్యాల బారిన సైతం పడుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వల విసురుతారిలా..

గేమింగ్ యాప్స్ ఇన్‌స్టాల్ చేసే వరకు ఆయా సంస్థలు ఫ్రీ అనే భ్రమలోనే చిన్నారులు, యువతను ఉంచుతున్నాయి. కొన్ని యాప్స్ అయితే మరో అడుగు ముందుకేసి గేమ్ ఆడండి–డబ్బులు గెలవండి అనే ఆప్షన్లు, ఆఫర్లను యువతను ప్రేరేపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చిన్నారులు, యువత తొలుత ఈ గేమింగ్ యాప్స్‌కు అలవాటుపడుతున్నారు. కొన్ని రోజుల తరువాత ఫ్రీ వెర్షన్ అయిపోయింది. ఇంకా ఆడాలన్నా.. ఆట వస్తువులు కొనాలన్నా డబ్బులు చెల్లించాలంటూ ప్రో వెర్షన్‌ను ఫోన్ స్క్రీన్ మీదకు తీసుకొస్తారు. అప్పటికే మానసికంగా గేమ్‌కు బానిసయినవారు డబ్బులు చెల్లించి గేమింగ్ యాప్స్ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. అయితే చిన్నారులు, యువత బ్యాంకు ఖాతాల్లో నగదు ఆశించిన స్థాయిలో ఉండకపోవడంతో వారి తల్లిదండ్రుల ఫోన్లకు అటాచ్ అయిన యూపీఐ (ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం) యాప్స్ నుంచి సులువుగా గేమింగ్ యాప్స్‌కు నగదు బదిలీ చేస్తున్నారు. ఈ విషయం తెలియని పెద్దలు వారి ఖాతాల్లో నగదు పోయినట్లు సైబర్ పోలీసులకు ఫిర్యాదులిస్తున్న ఘటనలు సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల కాలంలో ఎక్కువగా నమోదవుతున్నాయి

ప్రమాదకర ఆన్‌లైన్ గేమ్స్ ఇవీ..

ఫ్రీఫైర్, పబ్జీ, హంటర్, టెంపుల్‌రన్, క్యాండీక్రష్, **లూడో, సబ్‌వేసర్ఫేస్,** గ్రాండ్‌తెఫ్ట్‌ఆటో (శాన్ అడ్రాస్), **హిట్‌మ్యాన్స్,** స్లైపర్, ట్రూ స్కేట్, ది **కింగ్ ఆఫ్ ఫైటర్స్ 98,** పీస్‌డెత్, సైబర్ స్టిక్ **మ్యాన్, లింబో, మాన్యు**మెంట్, ది సన్, రిపోర్టర్–2, **మినీ క్రాఫ్ట్, షాడో** ఆఫ్ డెత్, డార్క్ నైట్, **స్టిక్ మాన్ మాస్టర్, బ్లాన్స్** టీడీ6, గ్రిడ్ ఆటో **స్పోర్ట్స్, ఏ డాన్స్ ఆఫ్** ఫైర్ అండ్ ఐస్‌తో పాటు **పలు రకాలైన రమ్మీ** యాప్స్ చిన్నారులు, యువ**తను మానసికంగా** లొంగదీసుకుని ఆన్‌లైన్ **దోపిడీకి** పాల్పడుతున్నాయి.

వ్యక్తిగత సమాచారం దోపిడీ

ఆన్‌లైన్ గేమ్స్ పూర్తిగా అపరిచితులతోనే సాగుతోంది. ఈ క్రమంలో జరిగే చాట్, గ్రూప్ కాల్ ద్వారా సైబర్ నేరగాళ్లు మీ ప్రొఫైల్ సేకరిస్తారు. అప్పుడప్పుడు జరిగే స్క్రీన్ షేరింగ్ ద్వారా బ్యాంకు ఖాతా, పాస్‌వర్డ్ వంటి వివరాలను తెలుసుకుని బ్యాంకు ఖాతాల నుంచి నగదు దోపిడీ చేస్తారు. మీ వ్యక్తిగత వివరాల ఆధారంగా మీ ఇంటి అడ్రస్ తెలుసుకుని మీకు ఓ లాటరీ తగిలిందని.. నగదు చెల్లిస్తే రూ.కోట్లు మీ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తామని నమ్మించి మోసానికి పాల్పడతారు. మీ గ్యాలరీలోని కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్‌కు దిగుతారు.

అత్యంత ప్రమాదం



ఆన్‌లైన్ గేమ్స్ చిన్నారులు, యువత మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ గేమ్స్ ఆడేవాళ్లకి కోపం విపరీతంగా పెరిగిపోతుంది. ఏకాగ్రత కోల్పోతారు. చదువుపై శ్రద్ధ తగ్గిపోతుంది. నిత్యం ఏకాంతంగా ఉండాలనే కోరుకుంటారు. నలుగురితో కలవరు. డిప్రెషన్ పెరిగిపోతుంది. ఎక్కువ సమయం తల, కాళ్లు, చేతులు, కళ్లు, కదలకుండా ఉంచడంతో నరాలన్నీ స్ట్రక్ అయిపోతాయి. దీంతో శారీరక సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి వారిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు చాలా రోజులు పడుతుంది.

– బి.వేణు శ్రీలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారి, రంగంపేట

ఎవరిని ఆశ్రయించాలంటే..



ఆన్‌లైన్ గేమింగ్‌లో చిక్కుకుని తమ బ్యాంకు ఖాతాల నుంచి నగదు పోగొట్టుకున్న బాధితులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో అధికారులను సంప్రదించాలి. పరువు పోతుందనో, నలుగురికి తెలిస్తే నవ్వుల పాలవుతామనో తమలో తామే బాధపడుతూ కూర్చోకుండా పోలీసులకు జరిగిన సంఘటన వివరంగా తెలియజేయాలి. బ్యాంకుఖాతా నుంచి నగదు డెబిట్ అయిన 24 గంటల లోపు పోలీసులను ఆశ్రయించినట్టు అయితే ఆ సొమ్మును తిరిగి రాబట్టేందుకు చాలా అవకాశం ఉంటుంది. సైబర్ క్రైం పోలీసు స్టేషన్లలోను ఫిర్యాదు చేయాలి. లేదా 1903 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలి.

– పి.విజయ్‌కుమార్, ఎస్ఐ, రంగంపేట

శివానికి ఉగాది నంది పురస్కారం


శివానికి నంది పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

అమలాపురం రూరల్: కామనగరువులోని ఓ ప్రవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఈవని శివాని ఉగాది నంది పురస్కారానికి ఎంపికైంది. సూర్య నృత్య కళానికేతన్ 15వ వార్షికోత్సవంలో భాగంగా కాకినాడలో 2024 ఉగాది నంది పురస్కారాల మహోత్సవం నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వివిధ విభాగాల్లో నృత్య ప్రదర్శనలకు 4 నుంచి 15 ఏళ్లలోపు బాలికలు సుమారు 365 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. కూచిపూడి ప్రదర్శనలో శివాని ప్రతిభ కనబరిచి ఈ పురస్కారం సాధించింది.

విహారయాత్రకు వెళ్లి విగతజీవుడయ్యాడు


యానాల కొండయ్య (ఫైల్)

రంగంపేట: విహారయాత్రకు వెళ్లి యువకుడు మృతి చెందడంతో రంగంపేట మండలం సింగంపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యానాల అచ్చియ్య, అక్కమ్మ దంపతులకు నలుగురు సంతానం చిన్నవాడైన యానాల కొండయ్య (33) అవివాహితుడు. ఇతడు మండలంలోని కోటపాడు గ్రామం వద్ద గల లిక్కర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఆదివారం కావడంతో తన తోటి స్నేహితులతో సరదాగా అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు విహార యాత్రకు వెళ్లారు. అక్కడ పొల్లూరు జలపాతంలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. దీంతో సింగంపల్లి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అందివచ్చిన కొడుకు విహార యాత్రకు వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు విలపిస్తున్నారు.

పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం

అల్లవరం: గోడిలంక–రెల్లుగడ్డ పంట కాలువలో అల్లవరం పాలం పాత బ్రాందీషాపు సమీపంలో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పంట కాలువలో ఉన్న మృతదేహాన్ని ఒడ్డుకి చేర్చి వివరాలు సేకరించారు. 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి తెలుపురంగు షర్ట్, గులాబీ రంగు లుంగీ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితమే పంటకాలువలో పడిపోయి ఉంటాడని, ముఖం గుర్తు పట్టలేదని విధంగా ఉందన్నారు. వివరాలకు అల్లవరం పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని తెలిపారు. గోడిలంక వీఆర్‌ఓ చంద్రరావు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాది నుంచి లోవతల్లి దర్శన భాగ్యం

- రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు
- 15 నెలలుగా బాలాలయంలో దర్శనమిచ్చిన తలుపులమ్మ తల్లి



స్వయంభువు తలుపులమ్మ తల్లి

తుని రూరల్: కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ తల్లి దర్శనాలు ఉగాది పర్వదినం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. రూ.15 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం, నాలుగు అంతస్తుల మహా మండపం, తొమ్మిది అంతస్తుల రాజగోపురం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ పనులు నిమిత్తం లోవ దేవస్థానంలో స్వయంభువుగా వెలసిన తలుపులమ్మ అమ్మవారి గర్భాలయాన్ని 2022 డిసెంబరు 28న మూసివేశారు. అప్పటి నుంచి మెట్ల మార్గంలో అమ్మవారి పెద్ద విగ్రహం వద్ద నిర్మించిన బాలాలయంలో అమ్మవారి దర్శనాలను ఏర్పాటు చేశారు. ఆలయ పునర్నిర్మానం పూర్తికావడం, గర్భాలయంలో అమ్మవారి దర్శనాలను ఇటీవల ప్రారంభించారు. అభివృద్ధి పనులు పూర్తికాకపోవడం, మరింత సమయం పట్టే అవకాశాలు ఉండడంతో భక్తుల సౌకర్యార్థం ప్రధాన గర్భాలయంలో అమ్మవారి పునఃదర్శనాలను ఏప్రిల్ తొమ్మిదో తేదీ (ఉగాది) నుంచి ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్టు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ పెన్మెత్స విశ్వనాథరాజు ఆదివారం తెలిపారు. శరవేగంగా జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను కలసిన విలేకర్లతో విశ్వనాథరాజు మాట్లాడుతూ ఉగాది రోజు పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారి దర్శనాలను పునఃప్రారంభిస్తామన్నారు. ఆ రోజు నుంచి ఐదు రోజులు వివిధ గ్రామాలకు చెందిన మహిళలచే కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు.


అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి డీసీ విశ్వనాథరాజు

4 అంతస్తుల మహా మండపం

ఆలయంలో పూర్వం ఉన్న క్యూలైన్లు తొలగించి ఆ స్థానంలో నాలుగు అంతస్తుల మహా మండపాన్ని నిర్మిస్తున్నారు. మొదట మండపంలో వినాయకుడి గుడి, టికెట్ల కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. రెండో మండంలో షాపింగ్ కాంప్లెక్సు (దుకాణాలు) ఏర్పాటు చేస్తున్నారు. మూడో మండంలో భక్తులు వేచి ఉండేందుకు క్యూ కాంప్లెక్సు నిర్మిస్తున్నారు. నాలుగో మండపంలో అమ్మవారి పంచలోహ విగ్రహాలు ఏర్పాటు, గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న తర్వాత భక్తులకు ఆశీర్వాదాలకు, పర్వదినాల్లో కుంకుమ, ఇతరేతర పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.


నిర్మాణంలో ఉన్న మహా మండపం, తొమ్మిది అంతస్తుల రాజగోపురం

తొమ్మిది అంతస్తుల రాజగోపురం, అక్కడి నుంచి దిగువకు మెట్లను నిర్మించనున్నారు. ప్రస్తుతం రాజగోపురం నిర్మాణం దక్షిణం నుంచి తాత్కాలిక మెట్ల మార్గాన్ని ప్రధాన గర్భాలయానికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ నెలాఖరుకు పూర్తిగా ప్రధాన ఆలయంలో అమ్మవారినే భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో స్వయంభూవుగా వెలసిన తలుపులమ్మ అమ్మవారి భక్తులకు 15 నెలలు తర్వాత అమ్మ దర్శన భాగ్యం కలగనుంది.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం


ప్రియాంకకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ తదితరులు

తాళ్లరేవు: తండ్రిని కోల్పోయి చదువు కోసం ఇబ్బందులు పడుతున్న నిరుపేద విద్యార్థినికి పలువురు దాతలు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. మండల పరిధిలోని ఇంజరం గ్రామానికి చెందిన పల్ల ప్రియాంక తండ్రి రాజారత్నం గతంలోనే మృతి చెందారు. దీంతో ఎంబీబీఎస్ చదవాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆమె ఆశలు అడియాశలయ్యాయి. ఈ నేపథ్యంలో స్థానిక సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి తదితరులు దాతలను ఒప్పించి ఆర్థిక సహాయం అందజేసారు. దీనిలో భాగంగా ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ రూ.15 వేలు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు చింతలపాటి శ్రీనివాసరాజు రూ.5 వేలు, స్థానిక నాయకులు రూ.5 వేలు మొత్తంగా రూ.25 వేలను ఆదివారం ఆమెకు అందజేశారు. భవిష్యత్‌లో కూడా ఆమె చదువుకు అండగా ఉంటామని దాతలు భరోసానిచ్చారు. ఉప సర్పంచ్ కోరుకొండ అప్పారావు, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, నాయకులు పెయ్యల కొండబాబు, మధు, రాజు, శ్రీను, చిన్న, రాజా, శ్రీను తదితరులు ఉన్నారు.

ఉమా కొప్పేశ్వరస్వామికి ఏసీల సమర్పణ

- పలివెల ఆలయ గర్భగుడికి సమర్పించిన భక్తుడు


పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి ఆలయంలో అమర్చిన ఏసీలు

కొత్తపేట: మండల పరిధిలోని పలివెల ఉమా కొప్పేశ్వర స్వామివారి గర్భాలయానికి ఒక భక్తుడు రెండు ఏసీలు సమర్పించారు. కొత్తపేటకు చెందిన కముజు రామసుబ్రహ్మణ్యం కుమారుడు, ఐస్ ఫ్యాక్టరీ అధినేత కముజు రాంప్రసాద్ వాటిని స్వామివారికి సమర్పించారు. భూగర్భంలో ఉన్నట్టు ఉండే పురాతన ఆలయ గర్భగుడిలో పూజలు, అభిషేకాలు నిర్వహించే అర్చకులు, స్వామి, అమ్మవార్లను దర్శించుకునే భక్తులు వేసవి కాలంలోనే కాక ఇతర కాలాల్లోనూ ఉక్కపోతతో చెమటలు కారుస్తూ ఇబ్బంది పడుతుంటారు. ఆ పరిస్థితి లేకుండా ప్రశాంతంగా పూజలు చేసి, దర్శించుకునేందుకు వీలుగా, చల్లని సౌకర్యం కోసం వాటిని సమర్పించినట్టు దాత రాంప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం టెక్నీషియన్లను పంపించి వాటిని అమర్చారు. దాత రాంప్రసాద్‌ను దేవస్థానం తరఫున పాలకమండలి చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, సభ్యులు, ఈఓ బి.కృష్ణచైతన్య, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

టిప్పర్ డ్రైవర్ అని అవహేళన చేస్తారా?

- చంద్రబాబు వ్యాఖ్యలు శోచనీయం
- వైఎస్సార్ సీపీ నాయకురాలు బాల మునికుమారి ఆగ్రహం


కాశి బాలమునికుమారి

ముమ్మిడివరం: దళితుడైన సామాన్య యువకుడికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే టిప్పర్ డ్రైవర్‌కు జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ ఇచ్చాడంటూ అవహేళన చేయడం సిగ్గు చేటని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాశి బాలమునికుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె ఆదివారం ముమ్మిడివరంలో విలేకర్లతో మాట్లాడుతూ పార్టీపై విశ్వాసం, ప్రజలకు సేవ చేయాలనే గుణం ఉన్న ట్రక్ డ్రైవర్ వీరాంజనేయులకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితులపై ఉన్న నిబద్ధతను చాటుకున్నారన్నారు. పేదలు, దళితులను కించపరిచేలా చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. టిప్పర్‌తో గుద్దితే సైకిల్ ఎక్కడ ఉంటుందో చంద్రబాబు తెలుసుకోవాలని ఆమె హెచ్చరించారు. ఉపాధి కూలీకి, టిప్పర్ డ్రైవర్‌కు టికెట్ ఇచ్చిన డైనమిక్ లీడర్ జగన్ అని కొనియాడారు. రూ.కోట్లు తీసుకుని ధనికులను చట్ట సభలకు పంపాలనుకునే నీచ బుద్ధి చంద్రబాబుదని మునికుమారి ఆరోపించారు. ఉన్నత చదువు చదువుకుని పొట్ట పూటి కోసం డ్రైవర్ వృత్తిని చేపడితే అవహేళన చేయడం రాజ్యాంగాన్ని అవహేళన చేయడమేన్నారు.

కోల్డ్ స్టోరేజీలో కార్మికుడి మృతి

- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన
- రూ.4 లక్షలు ఇచ్చేందుకు రాజీ కుదిర్చిన పోలీసులు
- పోలీసుల తీరుపై మండిపడుతున్న ప్రజా సంఘాలు


బోడియ్య మృతదేహం

పెద్దాపురం: స్థానిక ఏడీబీ రోడ్డులోని ఆంగ్లిన్ లాజిస్టిక్ కోల్డ్ స్టోరేజీలో గేట్ మీద పడి కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం తుని మండలం తేటగుంటకు చెందిన సన్నిబోయిన బోడియ్య (55) ఏపీఐఐసీ ఏరియాలో డ్రైనేజీ పని నిమిత్తం వచ్చాడు. పని ముగించుకుని అటుగా వెళ్లుతున్న అతనిని స్టోరేజ్ వాచ్‌మెన్ అక్కడి పెద్ద గేటును ముందుకు తోయాలని కోరాడు. మరో నలుగురుతో కలిసి తోసే ప్రయత్నంలో సుమారు మూడు టన్నులు బరువైన గేట్ బోడియ్యపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ పరిణామంతో అతడి మృతదేహాన్ని గుట్టు చప్పుడు కాకుండా పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు యాజమాన్యం ప్రయత్నించగా స్థానికులు నివారించారు. విషయాన్ని పెద్దాపురం పోలీసులకు తెలియజేయగా ఏఎస్ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని బోడియ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన బంధువులు తమకు చేయాలని స్టోరేజీ వద్ద ఆందోళన నిర్వహించగా పోలీసులు చొరవ తీసుకుని బాధితుడి కుటుంబానికి సుమారు నాలుగు లక్షల రూపాయలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చారు. అయితే బాధిత కుటుంబానికి సుమారు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రజా సంఘాల తరఫున సీఐటీయూ నాయకులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతికుమార్‌లు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తగు న్యాయం చెయ్యకుండా పోలీసులు నాలుగు లక్షలతో రాజీ కుదర్చడంపై ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.


కోల్డ్ స్టోరేజీ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

గండేపల్లి: బహిర్భూమికి వెళ్తున్న మహిళ మెడలో 2 కాసుల పుస్తెల తాడును మోటారు సైకిల్‌పై వచ్చిన ఆగంతకులు లాక్కుని పరారైన సంఘటన ఆదివారం మల్లేపల్లిలో చోటు చేసుకుంది. గండేపల్లి ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మల్లేపల్లి గ్రామంలో పోతుల చెల్లారావు అతని భార్య మంగయ్యమ్మ నివసిస్తున్నారు. ఆమె పుట్టుకతోనే మూగ. తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఇంటి ముందు ఇద్దరూ వుండగా ముగ్గురు వ్యక్తులు వచ్చి బహిర్భూమికి వెళ్లాలి కొద్దిగా బాటిల్‌తో నీరు కావాలని అడిగారు. చెల్లారావు నీరు ఇచ్చే పనిలో వుండగా అదే సమయంలో మంగయ్యమ్మ బహిర్భూమికని నడిచి వెళుతోంది. ఇదే అదనుగా ముగ్గురు వ్యక్తులు బండిపై ఆమెను వెంబడించి ఆమె మెడలో పుస్తెల తాడు లాక్కుని పారిపోయారు. చెల్లారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల రైలు నుంచి జారిపడి ఇద్దరి మృతి

అన్నవరం: వేర్వేరు ప్రమాదాల్లో రైళ్ల నుంచి జారిపడి ఇద్దరు మృతి చెందారు. అన్నవరం రైల్వేస్టేషన్ వద్ద విజయవాడ వైపు వెళ్లే రైల్వేలైన్ సమీపంలోని గేటు వద్ద గుర్తు తెలియని మహిళ రైలు నుంచి జారిపడి మృతి చెందింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ త్రినాథ్ తెలిపిన వివరాల మేరకు ఆదివారం ఉదయం పది గంటల సమయంలో విజయవాడ వైపు వెళ్తున్న రైలు నుంచి గుర్తు తెలియని మహిళ జారి పడిపోయి మృతి చెందింది. ఆమెకు సుమారు 35 ఏళ్లు ఉంటాయని. ఆమె ముక్కుపొడుం రంగు పంజాబీ డ్రెస్ ధరించి ఉందని తెలిపారు. ఆమె చుట్టు పక్కల స్టీలు గిన్నెలు పడి ఉన్నాయని, అంతకు మించి ఆధారాలేవీ లభించలేదని తెలిపారు. ఆమె మృతదేహాన్ని తుని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఆమె వివరాలు తెలిసిన వారు తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు. తుని రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారుఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం–కడియం మధ్య ఒకరు..

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం–కడియం రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి జారి పడి సుమారు 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రాజమహేంద్రవరం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదని నీలం, సిమెంట్ రంగు టీషర్ట్, లైట్ బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు రాజమహేంద్రవరం జీఆర్పీ స్టేషన్ 0883 2442821, 94914 44022 నంబర్లలో సంప్రదించాలన్నారు.